క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఆరిలోవ: విశాలాక్షినగర్ ప్రాంతంలో విద్యుత్ మరమ్మతులు చేపట్టనుండడంతో సోమవారం పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. విశాలాక్షినగర్ సబ్ స్టేషన్ ఎస్ఎస్ సబ్ స్టేషన్ 11 కేవీ జోడుగుళ్లపాలెం ఫీడర్ పరిధిలో రోడ్ల పక్కన చెట్ల కొమ్మలు తొలగించనున్న కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జోడుగుళ్లపాలెం, దయాల్‌నగర్, కనకమహాలక్ష్మి కాలనీ, కోదండరామాలయం, తదితర ప్రాంతాలలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

మత్స్యకార పాఠశాలలో భోజనశాల ప్రారంభం



భోజన శాల భవనాన్ని ప్రారంభిస్తున్న రోటరి క్లబ్ ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ: రోటరీ క్లబ్ విశాఖపట్నం ఆధ్వర్యంలో 19వ వార్డు మత్స్యకార పాఠశాలలో నిర్మించిన భోజనశాలను ఆ సంస్థ ప్రతినిధులు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా క్లబ్ జిల్లా గవర్నర్ ఆర్‌వీ సుబ్బారావు మాట్లాడుతూ రూ.లక్ష వ్యయంతో విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా ఈ భవనాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. మత్స్యకార పాఠశాలను దత్తత తీసుకొని ఇప్పటికే అనేక సౌకర్యాలు కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు రామకృష్ణారావు, ఎస్ఎస్ఎన్ రాజు, మురళీకృష్ణ, పాఠశాల చైర్మన్ పేర్ల భాస్కరరావు, హెచ్ఎం సత్యవేణి, తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ ఎరీనాలో జిమ్ సేవలు ప్రారంభం

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్-8లో ఎస్3 స్పోర్ట్స్ ఎరీనా (ఏఎస్ రాజా మైదానం పక్కన)లో జిమ్ సేవలు ప్రారంభించినట్టు నిర్వాహకుడు సహాని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధునాతన సౌకర్యాలతో పాటు నిష్ణాతులైన శిక్షకుల పర్యవేక్షణలో జిమ్ సేవలు నగర వాసులకు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు 88852 22223, 83338 84448 నంబర్లను సంప్రదించాలన్నారు.

నవ్వుల్లో ముంచెత్తిన హాస్య వల్లరి



స్కిట్ ప్రదర్శిస్తున్న కళాకారులు

సీతంపేట: విశాఖ హ్యూమర్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన హాస్య వల్లరి ఆహుతులను కడుపుబ్బా నవ్వించింది. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రావి గోపీకృష్ణ, ఎస్.ఎస్.రామానుజం పర్యవేక్షణలో పలువురు కళాకారులు స్కిట్లు ప్రదర్శించారు. వీటిలో వైఫై పాస్‌వర్డ్, టైమెంత, పనిమనిషి, ఎందుకలా ఏడుస్తున్నావ్, క్రికెట్ పిచ్చి, బామ్మగారు కోర్టు సీను, భోషాణం పెట్టె, నా హృదయం కొట్టేసారు, మిఠాయి సత్యం, షాపింగ్‌కు వెళ్తున్నా ఏం కావాలి, పెళ్లి రెండు స్వీట్లు, వాడు మన స్టాఫ్ కాదు, ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ స్కిట్లు ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తాయి. కళాకారులు రావి గోపీకృష్ణ, రామానుజం, భానుప్రకాష్, డి.ఎస్.ఎన్.మూర్తి, ఆర్.ఎస్.ఎన్.మూర్తి, నాగగణేష్, నాయుడు, శివజ్యోతి, ప్రసన్న స్కిట్లు ప్రదర్శించి అలరించారు.

పార్కు ఇలా.. ఆడుకునేదెలా?



ప్రమాదకరంగా ఇనుప ఊచలు



పార్క్ ఎదురుగా దెబ్బతిన్న ఫుట్‌పాత్

ఏయూ క్యాంపస్: వీఎంఆర్‌డీఏ ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆధునికీకరించిన చిన్నారుల పార్కు నిర్వహణ లోపంతో వెక్కిరిస్తోంది. సరదాగా కాసేపు పార్కులో ఆడుకోవడానికి వెళ్లే చిన్నారులకు నిరాశ ఎదురవుతోంది. ఆట వస్తువులు శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారాయి. కొన్నాళ్ల కిందట వుడా పార్కును స్మార్ట్‌సిటీ పార్కు పేరిట వీఎంఆర్‌డీఏ పూర్తి స్థాయిలో ఆధునికీకరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చింది. కాల గమనంలో నిర్వహణపై దృష్టి పెట్టకపోవడంతో ప్రస్తుతం పార్కులోని చిన్నారుల ఆట వస్తువులు పాడైపోయాయి. నిత్యం వందలాది మంది చిన్నారులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆడుకోవడానికి పార్కుకు వస్తున్నారు. పార్కులో ప్రవేశానికి పెద్దలకు రూ.20, చిన్నారులకు రూ.10 ప్రవేశ రుసుంగా వసూలు చేస్తున్నారు. పట్టుమని చిన్నారులు ఆడుకోవడానికి పది ఆట వస్తువులు కూడా ఇక్కడ లేని పరిస్థితి చూసి తీవ్ర నిరాశ చెందుతున్నారు. చెక్కతో తయారు చేసిన వస్తువులు పుచ్చిపోవడంతో మూలకు చేరాయి. ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తూ ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. పార్కులో పలు చోట్ల మొక్కల కుండీలు వ్యర్థాల కుప్పలుగా మారిపోయాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్కు అభివృద్ధితో పాటు నిర్వహణపై దృష్టి సారించాలని నగరవాసులు కోరుతున్నారు.



ప్రమాదకరంగా ఉన్న ఆట వస్తువులు





జారుడుబల్ల పరిస్థితి

డెయిరీఫారం కూడలి ఆధునికీకరణలో మార్పులు



ఫౌంటేన్ మధ్యలో తొలగించిన గోడ

ఆరిలోవ: జీవీఎంసీ పదో వార్డు పరిధి పాత డెయిరీ ఫారం కూడలిలో జీవీఎంసీ చేపట్టిన ఆధునికీకరణలో మార్పులు చేస్తున్నారు. జీవీఎంసీ అధికారులు నగరంలో కూడళ్లను ఆధునికీకరించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా పాత డెయిరీఫారం కూడలిని కూడా ఆధునికీకరించారు. వాటర్ ఫౌంటేన్ దాని మధ్యలో గోడ, చుట్టూ ఇనుప గ్రిల్స్ నిర్మించారు. ఫౌంటేన్ మధ్యలో నిర్మించిన గోడపై ఓ పడవను ఏర్పాటు చేశారు. ఈ కూడలిని మరింత ఆధునికీకరించాలని జీవీఎంసీ అధికారులు ఆలోచించి ఇప్పుడు మార్పులు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఫౌంటేన్ మధ్యలో నిర్మించిన గోడను ఆదివారం పూర్తిగా తొలగించారు. నెల క్రితమే ఆ గోడపై ఏర్పాటు చేసిన పడవ(సిమెంట్‌తో తయారు చేసినది)ను జీవీఎంసీ 8వ వార్డులోని ఓ పార్కుకు తరలించారు. ఇదిలా ఉండగా పూర్తిగా నిర్మించిన అనంతరం తొలగించి మళ్లీ కొత్తగా నిర్మించడం వల్ల ప్రజాధనం వృథా అవుతుందని స్థానికులు విమర్శిస్తున్నారు.

బాలికల పాపా హోంకు రెండు కంప్యూటర్ల వితరణ



పాపా హోం నిర్వాహకులకు కంప్యూటర్లు అందిస్తున్న రోటరీ క్లబ్ గవర్నర్ సుబ్బారావు

సీతమ్మధార: రోటరీ క్లబ్ విశాఖ పోర్ట్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ సీఎస్సార్ నిధుల నుంచి రెండు కంప్యూటర్లను సీతమ్మధారలోని బాలికల పాపా హోంకు వితరణ చేశారు. ఆదివారం పాపా హోం నిర్వాహకులకు కంప్యూటర్లను రోటరీ క్లబ్ గవర్నర్ ఆర్.వి.సుబ్బారావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాపా హోంలోని బాలికల విద్యాభివృద్ధికి ఉపయోగపడేలా కంప్యూటర్లు అందించామన్నారు. రోటరీ క్లబ్ ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. గౌరవ అతిథి మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ పూన మురళీకృష్ణ మాట్లాడుతూ బాలికలకు భవిష్యత్తులో క్యాన్సర్ బారిన పడకుండా ఉచితంగా వ్యాక్సిన్ వేస్తామని చెప్పారు. రోటరీ క్లబ్ విశాఖ పోర్ట్ సిటీ నిధులతో వీఎంఆర్‌డీఏ పార్క్ ఎదురుగా గల ఎంఎల్‌బీటీ స్కూల్‌కు రూ.2.50 లక్షలతో సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అప్పుఘర్ వద్ద గల ఫిషర్మన్ ప్రైమరీ స్కూల్‌కు రూ.1.20 లక్షలతో డైనింగ్ షెడ్ నిర్మించామన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు డి.వి.వర్మ, ఎస్ఎస్ఎన్ రాజు, కె.వి.రమణ, హోం అధ్యక్షుడు డి.సూర్యప్రకాశ్‌రావు, ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్, బాలికలు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7గంటల నుంచి స్వర్ణపుష్పార్చన వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేసి 108 స్వర్ణసంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ వెంకటరమణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణమండంలోని వేదికపై అధిష్టంపజేసి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం జరిపారు. సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం



యజ్ఞోపవీత ధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

28వ వార్డులో అన్నసమారాధన



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న పల్లా దుర్గారావు

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డు దసపల్లా హిల్స్ వద్ద ఉన్న బంగారమ్మ గుడి వద్ద ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. బంగారమ్మ అమ్మవారి మహోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ అన్నసమారాధనను వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పల్లా దుర్గారావు ప్రారంభించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలి



రిలే దీక్షలో పాల్గొన్న భెల్ (హెచ్‌పీవీపీ) సీఐటీయూ నాయకులు

అక్కిరెడ్డిపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కొత్తగా ఏర్పడిన ప్రభుత్వాలు వెనక్కు తీసుకోవాలని భెల్ (హెచ్‌పీవీపీ) సీఐటీయూ ప్రధానకార్యదర్శి జి.టి.పి.ప్రకాష్ డిమాండ్ చేశారు. ఆదివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సీటు ఆధ్వర్యంలో 1,244వ రోజు చేపట్టిన రిలేని నిరాహార దీక్షలో భెల్ సీటు నాయకులు పాల్గొని తమ మద్దతును ప్రకటించారు. కార్యక్రమంలో పాల్గొన్న భెల్ సీటు ప్రధానకార్యదర్శి జి.టి.పి.ప్రకాష్ మాట్లాడుతూ మూడేళ్లకు పైగా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వివిధ రూపాల్లో కార్మికులు ఆందోళన కార్యక్రమాలను చేపడుతున్నారన్నారు. కార్యక్రమంలో సనపల జగన్నాథరావు, సత్యనారాయణ, అల్సి అప్పలనాయాయణ, కె.నారప్పరెడ్డి, చైతన్య, జి.అచ్చం నాయుడు, పి.శివరాం, బి.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఎకో టూరిజం పార్కు



కంబాలకొండలో శిథిలమైన కాటేజీలు

ఆరిలోవ: జాతీయ రహదారి పక్కన ఉన్న పర్యాటక ప్రాంతం కంబాలకొండ ఎకో టూరిజం పార్కు శిథిలమవుతోంది. 2014లో సంభవించిన హుద్‌హుద్ తుపానుకు ఈ పార్కు దెబ్బతింది. ఇక్కడ హుద్‌హుద్ ప్రభావంతో కొన్ని శిథిలం కాగా.. ఆ తర్వాత మరికొన్ని సౌకర్యాలు సందర్శకుల వినియోగానికి పనికి రాకుండా పోయాయి. ప్రశాంతమైన వాతావరణం, చుట్టూ పచ్చని కొండల మధ్యలో అటవీశాఖ అధికారులు ఇక్కడ సుమారు 200 ఎకరాల విస్తీర్ణంలో ఎకో టూరిజం పార్కు ఏర్పాటు చేశారు. కొండల మధ్య కొలను, పచ్చని చెట్ల మధ్య సందర్శకులకు ఆహ్లాదం కలిగించే సౌకర్యాలు కల్పించారు. ఆ సౌకర్యాలన్నీ ఇప్పుడు మూలకు చేరాయి. దీంతో కార్తీక మాసంలో వనభోజనాల సందడి తప్ప, మిగతా రోజుల్లో సందర్శకులు జాడ ఇక్కడ కనిపించడం లేదు. దీంతో ఈ పార్కుకు ఆదాయం కూడా రానురాను తగ్గిపోతోంది. ఈ పార్కుకు లభిస్తున్న ఆదాయం నుంచే వన సంరక్షణ సమితి(వీఎస్ఎస్) ఆధ్వర్యంలో ఇక్కడ పని చేస్తున్న శంభువానిపాలెం గిరిజన యువకులకు వేతనాలు చెల్లిస్తారు.



విరిగిపోయిన కర్రల మంచె

- కంబాలకొండలో సందర్శకుల సౌకర్యార్థం అటవీశాఖ అధికారులు సిమెంట్ బెంచీలు, చెట్ల చుట్టూ రచ్చబండలు, రాతి బెంచీలు, కాటేజీలు, కర్రలతో మంచెలు, వాచ్ టవర్ నిర్మించడంతో పాటు పిల్లల కోసం ప్రత్యేకంగా ఆట పరికరాలు ఏర్పాటు చేశారు. అప్పట్లో ఇక్కడ ఏర్పాటు చేసిన గూళ్లలో పలు జాతుల పక్షులు అలరించేవి. 2014లో హుద్‌హుద్ ధాటికి ఇక్కడ అవన్నీ నాశనమయ్యాయి. అప్పటి నుంచి అధికారులు పార్కు పునరాభివృద్ధిపై శీతకన్ను వేసేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఐదు కాటేజీలు శిథిలమయ్యాయి. పలు చోట్ల రచ్చబండలు గచ్చులు ఊడిపోయాయి. సిమెంట్ బెంచీలు శిథిలమవుతున్నాయి. కర్రలతో ఏర్పాటు చేసిన మంచెలు విరిగిపోయాయి. కంబాలకొండల మధ్యలో నిర్మించిన వాచ్ టవర్ పూర్తిగా కూలిపోయింది. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు స్పందించి ఈ పార్కును అభివృద్ధి చేసి సౌకర్యాలు కల్పించాలని సందర్శకులు కోరుతున్నారు.



శిథిలమైన సిమెంట్ బెంచి

మరిడమ్మా...కాపాడమ్మా...

- ఘనంగా అడవివరం పొలిమేర దేవత మరిడమ్మ పండగ
- భక్తిశ్రద్ధలతో పొలిమేరకు సాగనంపిన గ్రామస్తులు



పూజలందుకున్న మరిడమ్మ



అడవివరం పొలిమేర వద్ద ఈటెలు, కర్రలతో వలయంగా అమ్మవారిని తీసుకొస్తున్న గ్రామస్తులు

సింహాచలం: అడవివరం గ్రామ పొలిమేర దేవత మరిడమ్మ(సత్తెమ్మ) పండగను ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. దుష్ట శక్తులు, క్షుద్రశక్తులు గ్రామంలోకి రాకుండా చల్లగా చూడాలని పూజలు చేశారు. చిన్నా, పెద్దా అంతా కలిసి అమ్మవారిని పొలిమేరకు సాగనంపారు. ఈ ఘట్టాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామపొలిమేర దేవత మరిడమ్మకు రెండేళ్లకోసారి పండగ నిర్వహించడం ఆనవాయితీ. దీనిలో భాగంగా తన అక్కచెల్లెళ్ల వద్దకు పొలిమేర నుంచి వచ్చేసిన మరిడమ్మను మళ్లీ సాగనంపే కార్యక్రమాన్ని ఆదివారం గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. భక్తులతో అడవివరం నుంచి శ్రీనివాసనగర్ సమీపంలోని మరిడమ్మ ఆలయం వరకు ఉన్న రెండు కిలోమీటర్ల ప్రధాన రహదారి జాతరగా మారింది. మిట్ట మధ్యాహ్నం, మండుటెండను సైతం లెక్క చేయకుండా గ్రామస్తులు తరలివచ్చారు. గాంధీనగర్‌లోని పైడితల్లి అమ్మవారి శతకంపట్టు వద్దకు గ్రామస్తులు, మహిళలు పసుపు కుంకుమలు, చీరలు, అమృత కలశాలతో చేరుకున్నారు. మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో అమ్మవారి చెక్కబొమ్మను పూజారి వంశీయులు శిరస్సుపై పెట్టుకుని బయలుదేరారు. దుష్ట శక్తులు, క్షుద్రశక్తులు అమ్మవారిని వెనక్కి నెట్టకుండా కర్రలు, ఈటెలతో వలయాన్ని ఏర్పాటు చేస్తూ గ్రామస్తులు అనుసరించారు. అమ్మవారు వెళ్లే దారిపొడవునా గ్రామస్తులు తమ ఇళ్ల ముందు పసుపు నీటితో మరిడమ్మ(చెక్కబొమ్మ)కు అభిషేకాలు చేశారు. సింహాచలం నుంచి గోపాలపట్నం వెళ్లే ప్రధాన రహదారిలోని బాలాజీనగర్ సమీపంలోని పొలిమేర వద్దకు రాగానే మరిడమ్మను మూడు సార్లు ప్రదక్షిణ చేయించారు. అక్కడి నుంచి అమ్మవారిని తీసుకెళ్లి మరిడమ్మ ఆలయంలో అధిష్ఠించారు. పసుపు, కుంకుమలు, చీరలు, పండ్లు సమర్పించి గ్రామస్తులు మొక్కు తీర్చుకున్నారు. అమ్మవారి పూజారి వంశీయుడు లండ వెంకటరమణ ఆధ్వర్యంలో పండగ నిర్వహించారు. పెద్ద ఎత్తున ప్రసాద వితరణ చేశారు.



పొలిమేర వద్ద అమ్మవారి వెనుక ప్రదక్షిణ చేస్తున్న గ్రామస్తులు, మహిళలు

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ద్వారకా ఎస్ఐ ధర్మేంద్ర

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు ఎస్ఐ ధర్మేంద్ర కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. సమాజంలో ఎటువంటి అల్లర్లు, గొడవలు చేయకుండా కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జీవించాలని సూచించారు. హద్దు మీరి నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మీరు చేసే పనులపై ఎప్పటికప్పుడు పోలీస్ నిఘా ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలని రౌడీషీటర్లకు ఎస్ఐ సూచించారు. అనంతరం రౌడీషీటర్లను వారి కుటుంబ సభ్యులకు పోలీస్ సిబ్బంది అప్పగించారు.

అలరించిన నృత్య ప్రదర్శన



నృత్యం చేస్తున్న విద్యార్థులు

మురళీనగర్: మురళీనగర్‌లోని డ్యాన్సర్స్ క్లబ్ ప్రథమ వార్షికోత్సవం వైశాఖి స్పోర్ట్స్ పార్కులో ఆదివారం ఘనంగా జరిగింది. వేడుకలను పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. మిస్ ఆంధ్రా తన్వి రిషిక ప్రత్యేకంగా తన నృత్యాన్ని ప్రదర్శించారు. డీ-16 చాంపియన్‌షిప్ టైటిల్ విజేత షాహిది స్టెప్పర్ ప్రదర్శన ఆహుతులను అలరించింది.